# రక్షణ రంగం

ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన రక్షణ వ్యవస్థ కలిగిన దేశాల్లో భారత దేశం ఒకటి. జాతీయ భద్రతకు భారత దేశం అనేక చర్యలు చేపట్టింది. ఈ భద్రత లక్ష్యాలన్నీ భాతర దేశ ఉన్నత విలువలైన ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, శాంతియుత సహజీవనం, జాతీయ లక్ష్యం అయిన సామాజిక, ఆర్థిక ఆభివృద్ధికి లోబడి ఏర్పరుచుకున్నవి. ప్రపంచ భద్రత ప్రత్యేకించి దక్షిణాసియా ప్రాంత భద్రత వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన రక్షణ విధానాలను భారత్ రూపొందించుకుంది. పొరుగు ప్రాంతంలోను, దేశంలోను నిరంతరం కొనసాగుతున్న తీవ్రవాద, మతోన్మాద కార్యకలాపాలవల్ల భారత దేశం తన రక్షణకు ఎదురయ్యే ఎటువంటి సవాళ్లనైనా దీటుగా ఎదుర్కొనేందుకు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

## భారత అణు విధానం:

భవిష్యత్తులో దేశ భద్రత, ఐక్యత, సార్వభౌమత్వాలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా ఉండేందకు కేవలం ఆత్మరక్షణకు మాత్రమే అణ్వస్త్ర సామర్థ్యాన్ని వినియోగించాలన్నది భారత అణు విధానం. అణ్వాయుధ పోటీ పట్ల భారత దేశానికి ఎటువంటి ఆసక్తి లేదు. ఈ భావాలకు అనుగుణంగానే దేశ అణు విధానం రూపొందించారు. మన ఆణు విధానంలోని రెండు ప్రధాన అంశాలు

- అణ్వాయుధ ప్రయోగంలో అత్యంత సంయమనాన్ని పాటించడం.
- శత్రువుపై అణ్వాయుధాన్ని ముందుగా ప్రయోగించకపోవడం.
- అయితే సంయమనం వికటించి ప్రమాదం ఎదురైతే తీవ్రమైన ఎదురుదాడి చేయాలన్నది మన అణు విధానంలోని మూడో అంశం.

ఈ వ్యూహాత్మక అణు వ్యవస్థను (స్ట్రాటజిక్ న్యూక్లియార్ కమాండ్-ఎస్ఎన్సీ)ను 2003లో ఏర్పాటు చేశారు. దీనికి ఎయిర్ మార్షల్ అస్తానా కమాండర్-ఇన్-చీఫ్‌గా నియమితులయ్యారు. క్షిపణులు, ఆయుధాలు వాటికి సంబంధించిన నిర్మాణాలన్నీ ఎస్ఎన్సీ అధీనంలో ఉంటాయి. భారత అణు విధానానికి సంబంధించి ఏ అంశాన్నయినా అమలు చేసే బాధ్యత ఎస్ఎన్సీదే. అయితే అణుదాడి చేసిన శత్రువుపై తిరిగి దాడి చేయాలన్న నిర్ణయాన్ని తీసుకునే అధికారం పౌర నాయకత్వం అయిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్)కి మాత్రమే ఉంటుంది. ఈ కమిటీ ఆదేశాలను ఎస్ఎన్సీ అమలు చేస్తుంది. అణు దాడిని ఎదుర్కునేందుకు భారత్ వద్ద శక్తివంతమైన అణ్వాయుధాలు ఉన్నాయి. వీటిలో మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, అణ్వాయుధ దాడి చేయగల విమానాలు, సర్ఫేస్ షిప్పులు, అణు జలాంతర్గాములు ఉన్నాయి.

భారత దేశం ఇప్పటివరకు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (న్యూక్లియార్ నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ-ఎన్‌పీటీ)పైగానీ, సమగ్ర అణు పరీక్షల రద్దు ఒప్పందం (కాంప్రహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ-సీటీబీటీ) పైగానీ సంతకాలు చేయలేదు. అయితే 1963, అక్టోబర్‌లో పాక్షిక అణుపరీక్షల రద్దు ఒప్పందానికి ఒప్పుకుంది. భారత దేశం ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ)లో సభ్యత్వం కలిగి ఉంది. అందువల్ల భారత్ తన 17 అణు రియాక్టర్లలో 4 అణు రియాక్టర్ల వరకు ఐఏఈఏ విధించిన భద్రతా నియమాలను పాటిస్తుంది. ఇక దేశానికి సంబంధించి అంతరిక్ష ఆధారిత సైనిక, పౌర నిర్మాణాల భద్రత, నిరంతరం పర్యవేక్షణకు 'ఇంటిగ్రేటెడ్ స్పేస్ సెల్'ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థను త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహిస్తాయి.

**సైన్యం (ఆర్మీ):** భారత దేశ సైనిక ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. భారత సైన్యానికి సంబంధించి నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ మొదలుకొని అన్ని అధికారాలు సైనిక దళాల ప్రధానాధికారి (చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్-సీఓఏఎస్)చేతిలో ఉంటాయి. సైన్యాన్ని ఆరు ఆపరేషనల్ కమాండ్లు (ఫీల్డ్ ఆర్మీస్)గాను, ఒక ట్రైనింగ్ కమాండ్‌గాను విభజించారు.

ప్రాంతీయ కమాండ్లు వాటి ప్రధాన కార్యాలయాలు:

1. సెంట్రల్ కమాండ్-లక్నో
2. ఈస్టర్న్ కమాండ్ – కోల్‌కతా
3. నార్తర్న్ కమాండ్ – ఉదంపూర్
4. వెస్టర్న్ కమాండ్ – చాంది మందిర్
5. సదరన్ కమాండ్ – పుణె
6. ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ – సిమ్లా (ఆర్మీ శిక్షణ విధానాన్ని రూపొందించడం కోసం ఈ కమాండ్‌ను ఏర్పాటు చేశారు)

ప్రస్తుత సైనిక సంఖ్య: 9,80,000 క్రియాశీలక దళాలు

రిజర్వ్ సైన్యం: 3,00,000 ఫస్ట్‌లైన్ దళాలు (ఐదేళ్ల లోపు పూర్తి కాలం సర్వీసు కలవారు)

**వైమానిక దళం (ఎయిర్ ఫోర్స్):** భారత వైమానిక దళం 1932 అక్టోబర్ 8న అధికారింగా ఏర్పడింది. 1933 ఏప్రిల్ 1న వైమానిక దళ మొదటి విమానం గగనతలంలోకి దూసుకు వెళ్లింది. వైమానిక దళ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. వైమానిక దళం అన్ని విభాగాలు వైమానికదళ ప్రధానాధికారి (చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్) అధీనంలో ఉంటాయి.

**ఎయిర్‌ఫోర్స్ ఆపరేషనల్ కమాండ్స్:** వెస్టర్న్ ఎయిర్ కమాండ్, సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్, సెంట్రల్ ఎయిర్ కమాండ్, ఈస్టర్న్ ఎయిర్ కమాండ్, సదరన్ ఎయిర్ కమాండ్. ఇవి కాక రెండు ఫంక్షనల్ కమాండ్లు ఉన్నాయి. అవి మెయింటెనెన్స్ కమాండ్, ట్రైనింగ్ కమాండ్.

**నౌకా దళం (నేవీ):** భారత సముద్ర జలాలలోనూ, తీరం వెంబడి ఉన్న దేశ ఆస్తులు ఇతర కీలక నిర్మాణాల భద్రతకు భారత నౌకాదళం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి అప్పటి ఇండియన్ రాయల్ నేవీకి 32 బాగ పాతబడిన నౌకలు మాత్రమే ఉండేవి. ఇవి కేవలం తీర ప్రాంతంలో పెట్రోలింగ్‌కు మాత్రమే అనువుగా ఉండేవి. 1950 జనవరి 26న భారత దేశం రిపబ్లిక్ అవతరించిన రోజునే 'రాయల్' అనే పదం తొలగి 'భారత నౌకా దళం' అవిర్భవించింది. సముద్ర జలాలలో ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ (ఈఈజెడ్) కింద వచ్చే 2.02 మిలియన్ చదరపు కిలోమీటర్ల భాగంలో చమురు, సహజ వాయువు, మత్స్య సంపద, సముద్రాంతర్భాగ వనరులు, చిన్న, పెద్ద ఓడ రేవులతో పాటు 7517 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీర ప్రాంతాన్ని యుద్ధ సమయాల్లోనే కాక శాంతి సమయాల్లో కూడా కాపాడటం నౌకాదళ ప్రధాన బాధ్యత. నౌకాదళ ప్రధానాధికారి ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. ఇది కాక మూడు ప్రాంతీయ కార్యాలయాలున్నాయి అవి

1.ఈస్ట్రన్ నావెల్ కామాండ్ (విశాఖపట్నం)

2.వెస్ట్రన్ నావెల్ కమాండ్ (ముంబై)

3. సదరన్ నావెల్ కమాండ్ (కోచి).

## కమిషన్డ్ ర్యాంకులు

| ఆర్మీ | నేవీ | ఎయిర్ ఫోర్స్ |
|---|---|---|
| జనరల్ | అడ్మిరల్ | ఎయిర్ చీఫ్ మార్షల్ |
| లెఫ్టినెంట్ జనరల్ | వైస్ అడ్మిరల్ | ఎయిర్ మార్షల్ |
| మేజర్ జనరల్ | రియర్ అడ్మిరల్ | ఎయిర్ వైస్ మార్షల్ |
| బ్రిగేడియర్ | కమండోర్ | ఎయిర్ కమండోర్ |
| కల్నల్ | కెప్టెన్ | గ్రూప్ కెప్టెన్ |
| లెఫ్టినెంట్ కల్నల్ | కమాండర్ | వింగ్ కమాండర్ |
| మేజర్ | లెఫ్టినెంట్ కమాండర్ | స్క్వ్రాడన్ కమాండర్ |
| కెప్టెన్ | లెఫ్టినెంట్ | ఫ్లైట్ లెఫ్టినెంట్ |
| లెఫ్టినెంట్ | సబ్-లెఫ్టినెంట్ | ఫ్లైయింగ్ ఆఫీసర్ |

# ప్రత్యేక భద్రతా దళాలు (స్పెషల్ సెక్యూరిటీ ఫోర్సెస్)

టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఏర్పడిన ప్రత్యేక దళమే 'నేషనల్ సెక్యూరిటీ గార్డ్' (ఎన్ఎస్జీ). ఈ దళాన్ని 'బ్లాక్ క్యాట్ కమెండోస్' అని కూడా అంటారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ యాక్ట్, 1985 కింద ఈ ప్రత్యేక దళాన్ని కేబినెట్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసింది. వీరు ధరించే హెల్మెట్‌లు నల్లటి రంగులో ఉండటంతో బ్లాక్ క్యాట్స్ అని పేరు వచ్చింది. వీరు కేంద్ర హోంశాఖ కింద డైరక్టర్ జనరల్ ఆఫ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ ఆధ్వర్యంలో పనిచేస్తారు. విఐపీల భద్రత, కుట్రలను వమ్ము చేయడం, నిర్బంధితులను విడిపించడం, విలువైన నిర్మాణాలు, ఆస్తులను తీవ్రవాదుల దాడుల నుంచి కాపాడటం వంటివి బ్లాక్ కమెండోల ప్రధాన బాధ్యతలు.

## స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ):

అత్యంత ప్రముఖ వ్యక్తుల (వివిఐపీస్)(ప్రధాన మంత్రి ఆయన/ఆమె కుటుంబ సభ్యులు) భద్రత 3 వేల మందితో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ దళాన్ని 1985లో మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ హత్యానంతరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎస్‌పీజీ ఆసియాలోనే ఇటువంటి దళాలలో అత్యంత క్రియాశీల దళంగా పేరు పొందింది. పోలీసులు, ఎన్ఎస్జీ కమెండోల నుంచి వీరిని ఎంపిక చేస్తారు. వీరికి అందించే శిక్షణ యూఎస్ సీక్రెట్ సర్వీస్‌కు అందించే స్థాయిలో ఉంటుంది. వీరిలో అధికారుల అంతా  వివిధ రాష్ట్ర/కేంద్ర ఐపీఎస్‌లే అయ్యుంటారు.

## ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్):

ఇది భారతీయ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)కు చెందిన ప్రత్యేక దళం. దీనిని 1992 అక్టోబర్‌లో ఏర్పాటు చేశారు. దొమ్మీలు, దౌర్జన్య కాండలు చెలరేగి అశాంతి పరిస్థితులు ఏర్పడినప్పుడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగి అదుపు చేస్తుంది. ఒక్కో దళంలో 100 నుంచి 110 మంది ఉంటారు. ఇటువంటి దళాలు 10 వరకు ఉన్నాయి.

## బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్):

సరిహద్దు భద్రతా దళాల (బీఎస్ఎఫ్)ను 1965 డిసెంబర్ 1న ఏర్పాటు చేశారు. శాంతి సమయంలో భారత సరిహద్దులను నిరంతరం కాపలా కాస్తూ, అక్కడ జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడం ఈ దళాల ప్రధాన బాధ్యత. ఇది కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో పనిచేసే పారా మిలిటరీ దళం.

## సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్):

సీఆర్‌పీఎఫ్ అందరికీ చిరపరిచితమైన పోలీసు దళం. దేశంలో ఎక్కడ శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడినా అక్కడికి తక్షణం చేరుకుని పరిస్థితిని అదుపు చేస్తుంది. ఎన్నికలు, ఉద్యమాలు వంటి సందర్భాల్లో చెలరేగే అల్లర్లు, దాడులను నియంత్రించడం ఈ దళం బాధ్యత. ఇది స్వాంత్ర్యానికి పూర్వం 1939 జులై 27న క్రౌన్ రిప్రజెంటేటివ్స్ పోలీస్‌గా ఏర్పడింది. తర్వాత 1949, డిసెంబర్ 28న సీఆర్‌పీఎఫ్ చట్టం కింద ఈ దళాన్ని సెంట్రల్ రిజర్వ్ పోలీస్‌గా మార్చారు. ఇది హోంశాఖ అధీనంలో ఉంటుంది.

## ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ):

ఇది పారా మిలటిరీ దళం. ఈ దళాన్ని ఇండో-టిబెటన్ సరిహద్దుల్లో భద్రత కోసం 1962 అక్టోబర్ 24న ఏర్పాటు చేశారు. ఈ దళాలు పర్వతారోహణ, విపత్తు నివారణ నిర్వహణ, అణు, జీవ, రసాయన ఉపద్రవాలను ఎదుర్కోవడంలో సుశిక్షితులై ఉంటారు. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాల్లో ఐటీబీపీని నియమిస్తారు.

## సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్:

కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలను 1983, జూన్ 15న ఏర్పాటు చేశారు. వీటి ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దేశంలోని కీలక పరిశ్రమలైన అణు విద్యుత్ కేంద్రాలు, అంతరిక్ష కేంద్రాలు, రక్షణ (పరికరాల తయారీ) కేంద్రాలు, కరెన్సీ ముద్రణాలయాలు, చమురు క్షేత్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, ప్రధాన నౌకాశ్రయాలకు భద్రత చేకూరుస్తాయి.